క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి

మెట్‌పల్లిరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రజలకు శుభ్రత పాటించాలని అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

సారంగాపూర్: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సారంగాపూర్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు సోగాల్ల విజయ్‌కుమార్, వనజ, ప్రశాంత్ అన్నారు. శనివారం మండలంలోని పెంబట్లలో ఉపాధిహామీ కూలీలతో నిర్వహించిన సమావేశంలో బ్యాంకుల ద్వారా ప్రజలు అందుతున్న సేవలను వివరించారు. బ్యాంకుల్లో పొదుపు చేస్తే మన డబ్బులకు భద్రత ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మన బ్యాంక్ వివరాలు, ఆధార్, ఓటీపీ, పాన్ వివరాలను చెప్పవద్దని, సైబర్‌నేరగాళ్లు మోసంతో మన అకౌంట్‌ల నుండి డబ్బులు డ్రా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ కొలపాక రాజు, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

పశుసంపద వృద్ధి చేసుకోవాలి



పశువైద్యశిబిరం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

బుగ్గారం: రైతులు ఆర్థికంగా పశుసంపద ఎంతో ఉపయోగపడుతుందని పశువులను కాపాడుకోవాలని ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని సిరికొండలో పశుసంవర్ధకశాఖ సహకారంతో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు తిరుపతిగౌడ్, సునీల్,వేణుగోపాల్,సిబ్బంది సంతోష్,మనోజ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుముల లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మేడిపల్లి: భీమారం మండలంలోని లింగంపేటలో పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు నిర్వహించారు. పంటలో సాగులో వినియోగించే రసాయన ఎరువులపై అవగాహన కల్పించారు. అవసరం మేరకే రసాయనాలు వినియోగించాలని నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ నాయక్, సాద్వీ, మిట్టపల్లి రాజిరెడ్డి, వ్యవసాయదికారులు సురేందర్ నాయక్ పాల్గొన్నారు.

నవోదయ పాఠశాల మంజూరుపై హర్షం

కోరుట్ల: జవహర్ నవోదయ పాఠశాల కోరుట్లకు మంజూరు కావడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్త చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కృషితోనే కోరుట్లకు నవోదయ పాఠశాల సాధ్యమైందన్నారు. అంతే కాకుండా తాత్కాలిక భవనాల ఏర్పాటుకు ఎంపీ అరవింద్ రూ. 20 లక్షలు ఎంపీ ల్యాండ్ నిధులు మంజూరు చేయడంపై ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

మరమ్మతులకు మోక్షమెప్పుడో?

- గతేడాది వర్షాలకు దెబ్బతిన్న చెరువు కట్టలు
- కట్టలు, తూములు, మత్తళ్లకు గండ్లు
- పునరుద్ధరణపై దృష్టి సారించని ప్రభుత్వం



బండలింగాపూర్ చెరువు

మెట్‌పల్లిరూరల్: చెరువులు,కుంటలు చెదిరిపోతున్నాయి. వాటికి కనీస మరమ్మతులు లేకపోవడంతో అధ్వానంగా మారిపోయాయి. పునరుద్ధరణపై ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడంతో దారుణంగా తయారయ్యాయి. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు,కుంటల్లో భారీగా నీరు చేరి కట్టలకు గండ్లు పడుతున్నాయి. తూములు,అలుగులు దెబ్బతింటున్నాయి.కొన్నేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు ఇప్పటికీ ఎంతో నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితుల్లో చెరువులు,కుంటల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

చెరువులు,కుంటల మరమ్మతుల విషయంలో శాశ్వత చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దెబ్బతిన్న చెరువులు,కుంటలకు ప్రత్యేక దృష్టి సారించి తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నప్పటికీ పెద్దగా ఫలితం ఉండడంలేదు. ఇప్పటికీ ఎన్నో పనులకు అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. కానీ వాటిలో కొన్ని పనులకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. మిగతా చెరువులు,కుంటలు మరమ్మతులకు నోచుకోవడంలేదు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్ద మత్తడి, చిన్నమత్తడి, రామచ్చక్కపేట మాదిగకుంట, చౌలమద్ది మత్తడి, జగ్గాసాగర్ వరదకాల్వ గేట్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. మిగతా చాలా పనులకు నిధులు మంజూరు కాలేదు. దెబ్బతిన్న చెరువులు,కుంటలన్నింటీ మరమ్మతులకు నిధులు కేటాయిస్తే రైతులకు,మత్స్యకారులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువులు, కుంటలకు మరమ్మతు చేయించాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏళ్లుగా పునరుద్ధరణకు నోచుకోలే..

చెరువులు,కుంటలు ఏళ్లుగా పునరుద్ధరణకు నోచుకోవడంలేదు. 2014 నుంచి 2018 వరకు నాలుగు విడతల్లో అప్పటి ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కిందట చెరువుల మరమ్మతులు చేయించింది. చెరువుల కట్టలు, తూములు, పూడికతీత, పంట కాల్వలకు మరమ్మతులతో పాటు ఇతరత్రా పనులు చేపట్టింది. ఆ తర్వాత వీటిపై పట్టింపు కరువవడంతో చెరువులు,కుంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోంది. మెట్‌పల్లి మండలంలో మొత్తం 66 చెరువులు,కుంటలు ఉన్నాయి. వీటి కింద ఎంతో ఆయకట్టు సాగవుతుంది. మండలంలోని పలు చెరువు కట్టలు, తూములు, అలుగులు దెబ్బతినడంతో ఆయకట్టు చివరి భూములకు సరిగ్గా నీరందడంలేదు. దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అలాగే చెరువుల్లోని చేపలు కొట్టుకుపోతున్నాయి.దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మంజూరైన నిధులతో పనులు చేస్తున్నాం

చెరువులు,కుంటలకు తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రస్తుతం కొన్ని పనులకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరైన వాటిలో కొన్ని చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. మిగతా చెరువులు, కుంటల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే వాటి పనులు కూడా చేయిస్తాం.

– అరుణ్, ఎస్సారెస్పీ డీఈ, మెట్‌పల్లి



బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్‌లోని 4వ వార్డులో తాగునీటి ఇబ్బందులను తీర్చడానికి ఏళ్ల క్రితం వేసిన బోరు నిరుపయోగంగా మారింది. బోరు మోటారు చెడిపోయినప్పటి నుంచి పట్టించుకునే నాథుడు లేకపోవడంతో అందులో నీరున్నా ఎందుకూ పనికిరాకుండా పోయింది. బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన కరువైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ బోరును వినియోగంలోకి తీసుకువస్తే స్థానికంగా నీటి సమస్య కొంతవరకు తీరుతుందని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అఫ్జల్‌మియా, ఎంపీడీవో బుగ్గారం, సెల్ నం: 9866016113

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

విద్యార్థుల నైపుణ్యానికనుగుణంగా బోధించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: విద్యార్థుల నైపుణ్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ధరూర్ క్యాంపు పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల శిక్షణా ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలని, ప్రైవేటుకు ధీటుగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నూతన సాంకేతికతను నేర్చుకొని బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో డీఈవో రాము, వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు



జరిమానా విధిస్తున్న అధికారులు

కోరుట్ల: ప్లాస్టిక్ వాడితే చట్ట పరంగా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ అందె మారుతీ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని దుకాణాలు, రెస్టారెంట్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించి రెస్టారెంట్లు,డాబాల్లో నిల్వ ఉంచిన పదార్థాలను, స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.10, 500 వరకూ జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, బాలె అశోక్, మహేశ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు మంజూరు కోసం దివ్యాంగుడి హల్‌చల్



పోలీస్‌స్టేషన్ వద్ద దివ్యాంగుడు

సారంగాపూర్: ఇందిరమ్మ ఇల్లు మంజూరు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ దివ్యాంగుడు తాను సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని శనివారం సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అటు పోలీసులు, ఇటు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్పందించి సమస్య పరిష్కరించారు. బీర్‌పూర్‌కు చెందిన చీర్నేని శ్రీనివాస్ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేదని, ఇల్లు మంజూరు చేయకపోతే సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని సోషల్ మీడియాలో బీర్‌పూర్ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో ఈ విషయంపై అప్రమత్తమైన పోలీసులు శ్రీనివాస్‌కు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఏఎస్సై రవి కౌన్సిలింగ్ ఇచ్చారు. విషయం జీవన్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్ ఆందోళన విరమించాడు.

చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: గోవులను అక్రమంగా తరలించకుండా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో మండల బీజేపీ నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. వాహనాల్లో అక్రమంగా గోవులను తరలించే అవకాశముందని, పోలీస్ శాఖ పరంగా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు గాంధారి శ్రీనివాస్, ప్రతాప్, మహేశ్, రవీందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, శ్రీకార్, శాంతారాం, గంగమల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



శిక్షణ పొందిన చిన్నారులతో శిక్షకులు

కథలాపూర్: కథలాపూర్ మండలం ఊట్‌పెల్లి గ్రామంలో క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవికాలం ఉచిత వాలీబాల్ శిక్షణ తరగతులు శనివారం రాత్రి ముగిశాయి. ఈ శిబిరంలో 36 మంది క్రీడాకారులు నెలరోజులపాటు వాలీబాల్ క్రీడ గురించి నేర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెల్గటూర్: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వేసవికాల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. శిబిరంలో 62 మంది బాల బాలికలు శిక్షణ పొందారని శిక్షకుడు సతీష్ తెలిపారు.

భూపతిపూర్‌లో..

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో నెల రోజులపాటు నిర్వహించిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, సీనియర్ క్రీడాకారులు, పీఈటీ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ నూతన పాలకవర్గం ఏర్పాటు

కోరుట్ల రూరల్: పట్టణంలోని సాయిబాబా దేవాలయ నూతన పాలక వర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక వర్గం సభ్యులుగా గడ్డం కిరణ్, బాలె నర్సయ్య, నేమూరి భూమయ్య, పెంట అరవింద్, అల్లె సదాశివ్, నిమ్మల శ్రీనివాస్, రాచకొండ దేవరాజం, కోటగిరి నాగ భూషణం, చిలువేరి విద్యాసాగర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు సభ్యులకు ఆలయంలో నియామక పత్రాలు అందించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పాలక వర్గం అధ్యక్షుడి ఎన్నిక త్వరలో నిర్వహించనున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి

వెల్గటూర్: ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, మండలంలో మూతబడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ అన్నారు. మండంలోని కుమ్మరిపల్లి ప్రాథమిక పాఠశాల మూతపడగా, విద్యార్థులను చేర్పించడానికి మాజీ సర్పంచ్ విద్యాసాగర్, గ్రామ పెద్దలను కలిసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, పాశిగామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంపత్ కుమార్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని పూజలు

కథలాపూర్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని మండలంలోని అంబారిపేట ఓంకారేశ్వరస్వామి ఆలయంలో శనివారం కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి జవ్వాజి రవీందర్, మార్కెట్ డైరెక్టర్ జగన్‌రావు, ఆదిరెడ్డి, గంగారాం, రవి, దేవయ్య, గంగనర్సయ్య, రాజం, నవీన్, వెంకటేశ్, శంకర్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

మల్లాపూర్: గీత కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రామాగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గీత కార్మికులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. 50 ఏళ్లు దాటిన గీత కార్మికులకు రూ.2వేల పెన్షన్ అందించాని డిమాండ్ చేశారు. గీత కార్మికుల హక్కులకు పోరాడలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు రామాగౌడ్, మండల అధ్యక్షుడు బండి లింగస్వామి, గౌడ సంఘం గౌరవ సలహాదారులు పోన్నం రామాగౌడ్, సంఘం నాయకులు, కార్మికులు, సభ్యులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలాన్ని డ్రగ్స్ లేని మండలంగా, 100 శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దుదామని ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో సిరుప నాగభూషణం అన్నారు. శనివారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో సే నో టు డ్రగ్స్ అన్న పోస్టర్‌తో పాటు, ఉల్లాస్ కార్యక్రమాల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సామాజిక మిత్రుల చేయూత

- నిరుపేద బాలిక వైద్యానికి రూ.1.21 లక్షలు సాయం

ధర్మపురి: కూతురు క్యాన్సర్ బారినపడడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఫేస్‌బుక్ మిత్రులు అండగా నిలిచారు. రూ.1.21 లక్షలు సాయం అందించి ఉదారత చాటుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా దేవడ గ్రామానికి చెందిన చెనవెనవార్ సుభాష్, రేణుక దంపతులకు ఇద్దరు కూతుళ్లు. సుభాష్ ఆటో ట్రాలీ నడుపుతూ ఓ రేకుల షెడ్డులో నివాసముంటున్నారు. వీరి పెద్ద కూతురు నిక్షిత క్యాన్సర్ బారినపడడంతో నాగాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. ప్రస్తుతం చేతిలో డబ్బు లేక వైద్యం చేయించలేని పరిస్థితి ఏర్పడింది. వీరి దీన స్థితిని అక్కడి మిత్రుల ద్వారా తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించారు. మే 5న ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి సాయం అందించాలని కోరాడు. దీంతో ఎన్నారైలు స్పందించి బాలిక తండ్రి సుభాష్ బ్యాంకు ఖాతాకు రూ.1.21 లక్షల విరాళాలు పంపించారు.

కుల వివక్ష నిర్మూలనకు పాటుపడాలి

వెల్గటూర్ : కుల వివక్ష నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక అన్నారు. శనివారం ఎండపల్లి మండలం గుల్లకోటలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఎండపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌తో పాటు కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేశ్, ఏపీవో అనిల్, ఏపీఎం చంద్రకళ, అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: కులం పేరుతో దూషిస్తే చట్టరీత్యా నేరస్తులవుతారని ఎస్సై రవీందర్‌కుమార్ అన్నారు. మండలంలోని అయితిపల్లిలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అంటరానితనం, అస్పృశ్యత నివారణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమాల్ల ఎంపీవో మహేందర్, ఆర్ఐ జమున, పంచాయతి కార్యదర్శి మంజుల, దళిత నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తుర్తి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు ఎస్సీ కాలనీలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో ఏమైనా కులవివక్ష చూపిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు మద్దెల నగేశ్, చంద్రశేఖర్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో అందరూ కలిసిమెలిసి ఉండాలని కులమత భేదాలు ఉండకూడదని అన్ని కులాలు సమానమేనని జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నరేందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గిరిజన బాలికల గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీలత శనివారం తెలిపారు.1వతరగతిలో 30సీట్లు, 2వతరగతి లో 08 సీట్లు, 5వతరగతిలో10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీబీఎస్ఈలో విద్యాబోధన ఉంటుందని ఆసక్తిగల గిరిజన బాలికలు ఈనెల 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.వివరాలకు 9652141962 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

▸ ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో పెట్టక పోవడం సరికాదు

కోరుట్ల రూరల్: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఫొటో పెట్టకపోవడం సరికాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పిడుగు సందయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోహన్‌రావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారని, వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో పెట్టలేదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

▸ భూ భారతి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

వెల్గటూర్ : భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని వెల్గటూర్, ఎండపల్లి తహసీల్దార్లు శేఖర్, అనిల్ తెలిపారు. జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో ధరణి పోర్టల్‌లో ఏవైనా భూ సమస్యలు ఉన్న రైతులు సదస్సులో పాల్గొని తమ సమస్యలపై ఫిర్యాదులు చేస్తే వారి భూ సమస్యలకు అధికారులు పరిష్కారం చూపిస్తారని తెలిపారు.

▸ సర్దుబాటు ఉత్తర్వులతో ప్రభుత్వం నిర్వీర్యం

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని ఒక పక్క ఆదేశిస్తూ, ప్రస్తుతం ఉన్న సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ అన్నారు. శనివారం కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రతీ ఏడాది తగ్గిపోతుందని, ఈ ఏడాది పెంపుకోసం కృషి చేద్దామని చెప్పిన విద్యాశాఖ అధికారులు, మళ్లీ ఏకపక్షంగా సర్దుబాటు ఉత్తర్వులు ఏంటని ప్రశ్నించారు. ఇది విద్యారంగానికి గొడ్డలిపెట్టని, తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోడ సాగర్ అటవీ భూమిని కబ్జా చేసిందుకు శనివారం న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు అటవీశాఖ ధర్మపురి రేంజ్ అధికారి వి. శ్రీనాథ్ తెలిపారు. సాగర్ రంగసాగర్ గ్రామ శివారుల్లోని అటవీప్రాంతంలో అటవీ భూమిని కబ్జా చేయడంతో పాటు, అటవీశాఖ నిర్మించిన నీటి కుంటను ధ్వంసం చేయగా, అతడిపై కేసు నమోదైంది. నిందితుడిని జగిత్యాల కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

▸ నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వెల్గటూర్ : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మహేశ్, ఎస్సై ఉమాసాగర్ అన్నారు. శనివారం ఎండపల్లి మండలంలోని ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

▸ లారీ–కారు ఢీ, ఏఎస్సైకి గాయాలు

మేడిపల్లి: కారు –లారీ ఢీ కొనడంతో కరీంనగర్ ఎస్బీ ఏఎస్సై విజయేందర్ రావుకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల వైపు వస్తున్న లారీ డ్రైవర్, అజాగ్రత్తగా లారీ నడుపుతూ అయిలాపూర్ వైపు వెళ్తున్న ఏఎస్సై విజయేందర్‌రావు కారుకు బలంగా ఢీకొనడంతో విజయేందర్‌రావు కాలుకి తీవ్ర గాయం కాగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అదే ప్రమాదంలో మరొక వాహనదారుడికి కూడా గాయాలు కాగా, జగిత్యాలకు తరలించినట్లు సమాచారం.

▸ చెరువును కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోండి

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి గ్రామశివారులోని చెరువును కొందరు కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వినోద్‌కు గ్రామస్తులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. కబ్జాకు గురైన చెరువును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, నాయకులు కోలి నరేందర్‌రెడ్డి, గంగారెడ్డి, పాల్గొన్నారు.

▸ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుండి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు.